సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 7 । జనవరి । 2025



వైరస్ కలకలం

దేశంలో హెచ్ఎంపీవీ కేసులు వెలుగు చూడటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

8లో



మాంస ప్రియులూ జాగ్రత్త

పండుగలు, జాతర్ల సీజన్ కావడంతో మాంస ప్రియులు జాగ్రత్తగా ఉండాలని పశు, వైద్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

8లో



ఏలూరులో డ్రోన్ సమ్మిట్

ప్రజల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఆధునిక పరిజ్ఞానంతో రూపొందిస్తున్న డ్రోన్స్ ఉపయోగపడతాయని ఏలూరు ఎస్పీ అన్నారు.

8లో

న్యూస్‌రీల్

ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీపై అవగాహన



పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఉభయగోదావరి జిల్లాల మేనేజర్ సుబ్బారావు, ఉద్యోగులు

పాలకొల్లు సెంట్రల్ : ఏపీఎస్ఆర్టీసీ కార్గో పార్శిల్, కొరియర్ రవాణా సేవల్లో భాగంగా డోర్ డెలివరీ సౌకర్యం కల్పించామని ఉమ్మడి జిల్లాల కార్గో మేనేజర్ జి.లక్ష్మీ ప్రసన్న వెంకట సుబ్బారావు అన్నారు. సోమవారం పాలకొల్లు పొట్టి శ్రీరాములు బస్టాండ్ కార్గో పార్శిల్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 20 నుంచి ఈనెల 19 వరకు నెలపాటు డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మాసోత్సవాల్లో భాగంగా బుకింగ్ చేసిన వినియోగదారుల ఎల్ఆర్‌లను డ్రా తీసి విజేతలకు బహుమతులు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా డోర్ డెలివరీలో రాష్ట్రంలో రెండో స్థానంలో, ఏలూరు జిల్లా 5వ స్థానంలో ఉందన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో గతేడాది కార్గో ద్వారా రూ.195 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎ.శివప్రసాద్ పాల్గొన్నారు.

జల సంరక్షణ ప్రాజెక్టులపై శ్రద్ధ



సెంట్రల్ నోడల్ అధికారి జితేంద్ర సింగ్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో జలశక్తి అభియాన్ ద్వారా చేపట్టిన జల సంరక్షణ ప్రాజెక్టుల పూర్తికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి, అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్ర సింగ్‌తో ఆమె సమావేశమయ్యారు. జిల్లాలో జలశక్తి పనుల పురోగతిని పరిశీలించేందుకు కేంద్ర బృందం ఆకివీడు, ఉండి మండలాల్లో పర్యటిస్తుందన్నారు. జిల్లాలో పనుల పురోగతిపై జేఎస్ఏ జిల్లా అధికారి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు వివరించారు. సెంట్రల్ నోడల్ అధికారి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన పనుల పురోగతి బాగుందని, ఇదే స్ఫూర్తితో పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. జేఎస్ఏ శాస్త్రవేత్త మౌనిక పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కమిషనర్ల సమావేశం

తాడేపల్లిగూడెం: జిల్లాలోని మున్సిపల్ కమిషనర్ల సమావేశాన్ని మంగళవారం పట్టణంలోని బలుసులమ్మ కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. పురపాలన శాఖ ప్రాంతీయ సంచాలకుడు (రాజమహేంద్రవరం) సమీక్ష నిర్వహిస్తారని మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఇదేందిరబ్బీ!

సాక్షి, భీమవరం : జిల్లాలో రబీ సాగు జాప్యమవుతోంది. ఖరీఫ్ కలిసిరాక, కూటమి ప్రభుత్వ సహకారం అందక దాళ్వా పెట్టుబడులు పెట్టేందుకు చేతిలో చిల్లిగవ్వలేని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. డిసెంబరు నెలాఖరుకు నాట్లు పూర్తిచేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటివరకు సుమారు 20 శాతం విస్తీర్ణంలో మాత్రమే నాట్లు పడ్డాయి.

దాళ్వా సా..గుతోంది

- రైతులకు నష్టాలు మిగిల్చిన ఖరీఫ్
- అందని ప్రభుత్వ సాయం
- దాళ్వా పెట్టుబడులకు సొమ్ములు లేక సతమతం
- జిల్లాలో 2.22 లక్షల ఎకరాల విస్తీర్ణం
- ఇప్పటివరకు 20 శాతమే నాట్లు పూర్తి
- గతేడాది జనవరి మొదటి వారంలోనే 60 శాతానికి పైగా పూర్తి

కష్టాలు మిగిల్చిన ఖరీఫ్

గత ఖరీఫ్ సీజన్ రైతులకు కష్టాలు, నష్టాలనే మిగిల్చింది. జిల్లాలోని 2.05 లక్షల ఎకరాల్లో సాగు చేయగా జూలైలో తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, వరదలకు తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఆకివీడు, తణుకు తదితర చోట్ల 38 వేల ఎకరాల్లోని నాట్లు, నారుమడులకు, 500 ఎకరాల్లోని ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అప్పటికే ఎకరాకు రూ.12 వేల వరకు పెట్టుబడులు కాగా రెండోసారి నాట్లు వేయాల్సి రావడంతో పెట్టుబడులు రెట్టింపయ్యాయి. మరలా కోతలు సమయంలో ఫెంగల్ తుపాను పరుగులు పెట్టించింది. కామన్ రకం ధాన్యం 75 కేజీల బస్తాకు రూ.1,725లు మద్దతు ధర కాగా తేమశాతం పేరిట దళారులు, మిల్లర్లు రూ.200లు నుంచి రూ.300ల వరకు కోతపెట్టడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి రావాల్సి ఉండగా పంట తెగుళ్లు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో 30 బస్తాలలోపే దిగుబడులు రావడంతో చాలామంది రైతులకు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఎదురైంది.

ప్రభుత్వం మొండిచేయి

రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు సాయం కొరవడింది. జిల్లాలోని 86,610 మంది రైతులకు విడతకు రూ.2 వేల చొప్పున రెండు పర్యాయాల్లో కేంద్ర ప్రభుత్వం రూ.34.64 కోట్ల పీఎం కిసాన్ సాయం మాత్రమే అందింది. కూటమి ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన అన్నదాత సుఖీభవ సాయం అందించలేదు. తొలకరి పంట నష్టపోయిన రైతులకు కనీసం బీమా పరిహారం కూడా అందించకపోగా రబీ నుంచి ఎకరాకు రూ.615లు చొప్పున బీమా ప్రీమియం భారాన్ని రైతులపై మోపింది.



అరట్లకట్ట సమీపంలో ఇంకా మొదలుకాని రబీ పనులు

సాగు జాప్యం.. రైతు సతమతం

జిల్లాలో 2.20 లక్షల ఎకరాల విస్తీర్ణంలో రబీ వరి సాగవుతుందని అంచనా. ముమ్మందు ఎండల తీవ్రత, నీటి ఎద్దడి సమస్యతో పంటకు నష్టం కలగకుండా సకాలంలో సాగు పూర్తిచేసేందుకు డిసెంబరు నెలాఖరు నాటికి నాట్లు పూర్తిచేయాలని, వెదజల్లు పద్ధతిని అవలంభించే వారు డిసెంబరు మొదటి వారంలోపు విత్తుకోవాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇప్పటికే సూచించారు. గతేడాది జనవరి మొదటి వారం నాటికి 60 శాతానికి పైగా నాట్లు పడగా ప్రస్తుతం 20 శాతం విస్తీర్ణం మేర నాట్లు పూర్తయినట్టు అంచనా. ముందుగా కోతలు మొదలైన తాడేపల్లిగూడెం రూరల్ ప్రాంతంలో దాదాపు నాట్లు పూర్తి కాగా తణుకు, ఇరగవరం, పెంటపాడు, పెనుమంట్ర తదితర చోట్ల పనులు ముమ్మరమవుతున్నాయి. ఖరీఫ్ చివరిలో కురిసిన వర్షాలకు తోడు పెట్టుబడులకు సొమ్ములు లేక సాగు జాప్యమవుతోందని రైతులు అంటున్నారు. జనవరి చివరి వారం వరకు నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు.

రబీలో సాగుచేసే రకాలు

రబీ సీజన్‌లో శ్రీధృతి (ఎంటీయూ–1121), తరంగిణి (ఎంటీయూ–1156), చంద్ర (ఎంటీయూ–1153), ఎంటీయూ 1010 (కాటన్ దొర సన్నాలు), ఎంటీయూ–3626 (ప్రభాత్), నెల్లూరు మషూరి (ఎస్ఎల్ఆర్–34449) తదితర రకాలను సాగు చేస్తుంటారు. వీటి సాగు కాలం 120 నుంచి 125 రోజుల వరకు ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి ఏప్రిల్ నెలాఖరు లేదా మే మొదటి వారం వరకు సాగు జరిగే అవకాశం ఉందని అంచనా. సాగు చివర్లో ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన నాట్లు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఓటర్లు 14,70,852

మహిళా ఓటర్లే అధికం



భీమవరం(ప్రకాశం చౌక్): ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ–2025 ప్రక్రియ అనంతరం ఓటర్ల తుది జాబితాను కలెక్టర్ నాగరాణి ప్రకటించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, ఎలక్టోరల్ అధికారి, సహాయ ఎలక్టోరల్ అధికారి కార్యాలయాలు, కలెక్టరేట్‌లో జాబితాను ప్రకటించినట్టు చెప్పారు. జిల్లాలో 1,461 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 14,70,852 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుష ఓటర్లు 7,20,597, మహిళా ఓటర్లు 7,50,179, థర్డ్ జెండర్ 76 మంది ఉన్నారు. గతేడాది అక్టోబరు 29న ప్రచురించిన ముసాయిదా జాబితాలో 14,71,189 మంది ఉండగా, సవరణల అనంతరం తుది జాబితా నాటికి సుమారు 337 మంది ఓటర్లు తగ్గారు. అత్యధికంగా భీమవరం నియోజకవర్గంలో 2,52,255 మంది ఓటర్లు ఉండగా, తక్కువగా నరసాపురం నియోజకవర్గంలో 1,70,683 మంది ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 888 మంది ఉండగా వారిలో 868 మంది పురుషులు, 20 మంది మహిళలు ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం విశేషం.



పరుగు పందెంలో అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తూ..



అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్

కొలువు కోసం ఉరిమిన ఉత్సాహం

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం పోలీస్ కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ దగ్గరుండి పర్యవేక్షించారు. అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 600 మందికి హాల్‌టికెట్లు జారీ చేయగా 396 మంది హాజరయ్యారు. పరీక్షల్లో సత్తాచాటిన 253 మందిని ఎంపిక చేసినట్టు ఎస్పీ చెప్పారు. అభ్యర్థులు పరీక్షలకు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్ర రావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

– ఏలూరు టౌన్

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

డీఆర్వో వెంకటేశ్వర్లు



మీకోసంలో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీల పరిష్కారంలో జాప్యం తగదని డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ (మీకోసం)లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన అర్జీలు పరిష్కరించాలని సూచించారు. అర్జీలు రీ ఓపెన్ అయితే తగు కారణాలను వివరించాలన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 142 అర్జీలు స్వీకరించారు. సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఇళ్లు తొలగిస్తారని ఆందోళన

పాలకొల్లు మండలం యాళ్లవానిగరువు ప్రాంతానికి చెందిన 30 కుటుంబాలు 70 ఏళ్లుగా చించినాడ రోడ్డులోని ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నారు. అయితే ఇటీవల కొందరు లేఅవుట్ చేస్తున్నామంటూ వీరి ఇళ్లు తొలగించడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే చెట్లు కూడా నరికివేశారని, తమ ఇళ్లు తొలగించకుండా న్యాయం చేయాలంటూ వీరంతా మీకోసంలో డీఆర్వోను కలిసి అర్జీ అందజేశారు.

8 సార్లు దరఖాస్తు చేసినా..



భీమవరం పట్టణం 12వ వార్డుకు చెందిన కొట్టు లక్ష్మి ఇంటి డోర్ నంబర్ తప్పుగా పడింది. ఇంటి నంబర్ తన పేరుతో మార్చాలని మున్సిపల్ అధికారులు చుట్టూ తిరిగి చివరికి మీకోసంలో ఎనిమిది సార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. సోమవారం మరోమారు ఆమె డీఆర్వోకు అర్జీ అందజేశారు.

భూమి ఆన్‌లైన్ చేయాలని..



అత్తిలి మండలం పాలూరుకి చెందిన కె.విజయకుమారికి ఆమె తండ్రి నుంచి వచ్చిన 15 సెంట్ల భూమి ఉంది. ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఆమె చివరకు సోమవారం భీమవరం వచ్చి మీ కోసం కార్యక్రమంలో డీఆర్వోకు అర్జీ అందజేశారు.

కులదూషణ చేస్తున్నారని..



దాసరి జయమ్మ డ్వాక్రా సభ్యురాలు. ఉండి మండలం ఉణుదుర్రు నుంచి గణపవరం వెళ్లిపోయారు. అక్కడ డ్వాక్రా గ్రూపులో చేరేందుకు చూడగా ఉణుదుర్రులో ఆమె పేరుపై రూ.2 లక్షల రుణం ఉందని తెలిసింది. దీనిపై ఉణుదుర్రు సభ్యులను ప్రశ్నిస్తే కూలదూషణ చేస్తున్నారని ఆమె డీఆర్వోకు ఫిర్యాదు చేశారు.

వనం వీడి.. జనంలోకి..



ఏజెన్సీ ప్రాంతంలో కొండలు కరిగిపోతుండటంతో వన్యప్రాణులు జనారణ్యంలోకి వస్తున్నాయి. దట్టమైన అడవుల్లో ఉండే నెమలి ఒకటి గిరిజన గ్రామంలోకి వచ్చి సందడి చేసింది. అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న బుట్టాయగూడెం మండలం అలివేరు గ్రామంలోని వీధుల్లోకి వచ్చి రోడ్లపై కొద్దిసేపు సంచరించింది. పంట పొలాల్లోని పురుగులు, ఎలుకలను తినేందుకు నెమళ్లు వస్తుంటాయని గిరిజనులు అంటున్నారు.

– బుట్టాయగూడెం

శునకాలపై సర్వే

సాక్షి స్పందన

నిడమర్రు: 'సాక్షి'లో సోమవారం ప్రచురించిన 'వికృతంగా వీధి కుక్కలు' శీర్షికన కథనానికి పశుసంవర్ధకశాఖ అధికారులు స్పందించారు. నిడమర్రులో స్కిన్ ఎలర్జీతో బాధపడుతున్న శునకాలపై సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్టు పెదనింద్రకొలను వెటర్నరీ వైద్యుడు శ్రీనివాస సందీప్ తెలిపారు. నిడమర్రు గ్రామంలో మొత్తం 25 వరకూ కుక్కలు స్కిన్ అలర్జీతో బాధపడుతున్నట్టు గుర్తించామన్నారు. పెంపుడు కుక్కల యజమానులు తమను సంప్రదిస్తే తక్షణం సూది మందు, ట్యాబ్లెట్ల రూపంలో మందులు ఇస్తామని చెప్పారు. ఏహెచ్ఏలు మారుతి, నవ్య, హైమ, వెటర్నరీ సహాయకులు రమణ ఉన్నారు.

పట్టణ ప్రణాళిక.. అవినీతికి వేదిక!

- అన్నీ తామై చక్కబెడుతున్న ఇద్దరు ఉద్యోగులు
- ప్రజాప్రతినిధుల పేరు చెప్పి అధికారులకు బెదిరింపులు
- నేరుగా 122 భవనాలకు అనుమతులు
- ఏలూరు నగరపాలక సంస్థలో అక్రమాలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగం అవినీతిమయంగా మారింది. విభాగంలోని ఇద్దరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతోపాటు ఇదేంటని ప్రశ్నించిన అధికారులనే బెదించే ధోరణిలో ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి పనులు చేసుకుపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల నగరంలోని 122 భవనాలకు నేరుగా పట్టణ ప్రణాళికా విభాగంలోని ఏసీపీ లాగిన్ నుంచి అనుమతులు ఇచ్చేశారని, తద్వారా పెద్ద మొత్తంలో సొమ్ములు దండుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదంతా నగరపాలక సంస్థ కమిషనర్‌కు తెలిసినా ఏం చేయకుండా మిన్నకుండి పోయారనే వాదనలు ఉన్నాయి. భవనం విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో దానికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దాటవేసే ధోరణిలో సమాధానం

భవనం ప్లాన్ అప్రూవల్‌కు సంబంధించి పట్టణ ప్రణాళికా విభాగం ఉద్యోగులు పరిశీలించి నిబంధనల మేరకు ఉంటే ఏసీపీ లాగిన్ నుంచి కమిషనర్ లాగిన్‌కు పంపి.. కమిషనర్ లాగిన్ ద్వారా మాత్రమే అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ ఇందుకు విరుద్ధంగా ఉద్యోగులు అనుమతులు ఇచ్చేశారని సమాచారం. దీనిపై కమిషనర్ సైతం దాటవేసేలా సమాధానం చెప్పడం కొసమెరుపు. కొన్ని ప్లానులు తన నోటీసులో లేకపోయినా పట్టణ ప్రణాళికా విభాగం ద్వారా నేరుగా ఇవ్వొచ్చంటూ ఆయన చెబుతున్నారు. ఈ విషయంలో వాస్తవాలను ఉన్నతాధికారులు పరిశీలించాల్సి ఉంది.

ఆన్‌లైన్‌లో లేని లేఅవుట్లు

నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు పంచాయతీల పరిధిలో సుమారు 200 వరకు డీటీసీ అనుమతి ఇచ్చిన లేఅవుట్లు ఉన్నాయి. వీటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చకుండా కొత్తగా వచ్చిన దరఖాస్తులకు అనుమతి ఉన్న లేఅవుట్లలోని నంబర్లు వేసి ఇచ్చేస్తున్నారని, దీని ద్వారా ప్రభుత్వానికి అపరాధ రుసుం పేరిట రావాల్సిన సొమ్ములు సిబ్బంది జేబుల్లోకి వెళ్లిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వ్యక్తిగత భవనం అనుమతి కోసం 200 గజాలకు రూ.లక్ష, ఆపైన ఉన్న వాటికి రూ.2 లక్షల వరకు మామూళ్ల రూపంలో చెల్లించాల్సి ఉంటుందని భవన యజమానులు అంటున్నారు. కమర్షియల్ పరిధిలో భవనాలకు మరింత సమర్పించు కోవాల్సిందేనని చెబుతున్నారు. నిబంధనల మేరకు వెళితే ముప్పుతిప్పలు పెడుతున్నారని వాపోతున్నారు.



ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

ఎల్‌టీపీలను పక్కనపెట్టి మరీ..

భవనాల అనుమతి కోసం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్‌టీపీ)ల ద్వారా ప్లాన్‌లు గీయించుకుని సచివాలయం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ ఇందుకు భిన్నంగా సచివాలయ వార్డు ప్లానర్స్ కార్పొరేషన్ కార్యాలయంలోనే ప్లానులు గీసేయడం షరా మామూలై పోయింది. ఇదీ కూడా పై అధికారులు చెప్పిన, వారికి అనుకూలమైన నలుగురైదుగురు ఎల్‌టీపీల లాగిన్‌ల ద్వారా పని కానిచ్చేస్తున్నారు. ఈ వ్యవహారంలో వార్డు సచివాలయ ప్లానర్స్ నుంచి అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)ల వరకు మామూళ్లు పంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న 60 మందికిపైగా ఎల్‌టీపీలు లబోదిబోమంటున్నారు.

నిబంధనల మేరకే అప్రూవల్స్

ప్రభుత్వ నిబంధనల మేరకే బిల్డింగ్ అనుమతులు మంజూరు చేస్తున్నాం. ఇందులో అవినీతికి తావులేదు. పెండింగ్ దరఖాస్తుల పరిశీలన, అనుమతి కోసం ప్రతి శుక్రవారం ఓపెన్ ఫారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. దీని ద్వారా అనుమతుల ప్రక్రియను సులభతరం చేశాం.

–డి.శ్రీనివాసు, ఏసీపీ, ఏలూరు కార్పొరేషన్

నేరుగా అనుమతులు ఇవ్వొచ్చు

కొన్ని సందర్భాల్లో నేరుగా పట్టణ ప్రణాళికా విభాగంలోని ఏసీపీ లాగిన్ నుంచి బిల్డింగ్ అనుమతులు ఇవ్వవచ్చు. అన్నీ కమిషనర్ లాగిన్ నుంచే ఇవ్వాల్సిన అవసరం లేదు. బిల్డింగ్ అనుమతుల విషయంలో ఎలాంటి అవినీతి జరిగినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

– ఎ.భానుప్రతాప్, కమిషనర్, ఏలూరు నగరపాలక సంస్థ

క్లుప్తంగా

బైక్ ఢీకొని పాదచారుడి మృతి

నరసాపురం రూరల్: మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో ఓ పాదచారుడిని బైక్ ఢీకొనడంతో మృతి చెందాడు. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బెల్లంకొండ సత్యనారాయణ (51) ఆదివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ఎదురుగా మోటార్‌సైకిల్ వచ్చి ఢీకొంది. దీంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. సత్యనారాయణ కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బండి సత్యనారాయణ తెలిపారు.

హాకీ పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం



విద్యార్థి విష్ణురాజును అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: విశాఖపట్టణంలో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ హాకీ సీనియర్ విభాగంలో భీమవరంలోని సీతా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి జి.విష్ణురాజు బంగారు పతకం సాధించాడు. త్వరలో కోయంబత్తూరులో జరిగే నేషనల్ రోలర్ హాకీ సీనియర్ విభాగంలో విష్ణురాజు పాల్గొంటాడని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రామకృష్ణ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ జీబీఎస్ కుమార్ రాజు, తదితరులు అభినందించారు.

వీధికుక్క దాడిలో నలుగురికి గాయాలు



శ్రీను కాలికి అయిన గాయం


ద్వారకాతిరుమల: స్థానిక శివాలయం ఆర్చిగేటు కూడలిలో ఒక వీధి కుక్క సోమవారం స్వైర విహారం చేసి నలుగురిని గాయపర్చింది. స్థానికుల కథనం ప్రకారం. శ్రీవారి దేవస్థానంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న తొంటెపాక శ్రీను శివాలయం ఆర్చిగేటు వైపు నుంచి తన ఇంటికి బైక్‌పై వెళుతున్నాడు. ఆ సమయంలో ఒక వీధి కుక్క వెంబడించి మరీ అతడి కాలిపై కరిచింది. అదేవిధంగా దేవస్థానంలో కాంట్రాక్టరుగా పనిచేస్తున్న మాడుగుల సీతారామయ్య, తిమ్మాపురంలోని సన్‌రైజ్ దాబా నిర్వాహకుడు బీర దిలీప్, అలాగే శ్రీను అనే మరో యువకుడిపై శునకం దాడి చేసింది. తీవ్ర గాయాలపాలైన బాధితులు స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స పొందారు. దాడులకు పాల్పడుతున్న వీధి కుక్కల భారి నుంచి ప్రజలకు, భక్తులకు రక్షణ కల్పించాలని పంచాయతీ అధికారులను పలువురు కోరుతున్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

ఉండి: లారీ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం యండగండికి చెందిన నేతింటి అప్పారావు(71) సోమవారం ఉదయం 6:30 గంటల సమయంలో స్థానికంగా ఉన్న పిప్పర రోడ్డుపై నిలిపి ఉంచిన లారీ వెనుక మూత్ర విసర్జన చేస్తున్నాడు. ఇది గమనించని లారీ డ్రైవర్ లారీని రివర్స్ చేయడంతో లారీ వెనుకనే మూత్ర విసర్జన చేస్తున్న అప్పారావు పైకి లారీ వెనుక ఎడమవైపు చక్రం ఎక్కడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పారావు కుమారుడు రాజారావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

వైరస్ కలకలంతో అప్రమత్తం

- హెచ్ఎంపీవీ వైరస్‌పై ఆందోళన అవసరం లేదంటున్న వైద్యులు
- జాగ్రత్తలు పాటించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సూచన



భీమవరం(ప్రకాశం చౌక్): దేశంలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు వెలుగు చూడడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే దేశంలో మూడు కేసులు నమోదుకాగా.. ఈ వైరస్ పట్ల ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే మంచిదని జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.భానునాయక్ సూచించారు.

లక్షణాలు, వ్యాప్తి

సాధారణంగా ఈ వైరస్ వలన జలుబు, ముక్కు దిబ్బడ, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది దాదాపు 2 నుంచి 5 రోజుల తరువాత వెళ్లిపోతుంది. ఒకవేళ తగ్గకపోయినా, లక్షణాలు ఉన్నా వైద్యుడిని సంప్రదించాలి. ఈ వైరస్ అన్ని వయసుల వారిలో కూడా ఎగువ, దిగువ శ్వాసకోశ వ్యాధులకి కారణం అవవచ్చు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో, వృద్ధుల్లో, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారిలో కీమోథెరపీ, అవయవ మార్పిడి చేయించుకున్న వారిలో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. హెచ్ఎంపీవీ బారిన పడిన చాలా మంది పిల్లలు 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారు. వీరిలో బ్రాంకై టిస్, నిమోనియా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. 5 నుంచి 16 శాతం మందిలో నిమోనియా వంటి శ్వాసకోశ సంక్రమణ కూడా అభివృద్ధి చెందుతుంది.

వ్యాప్తి ఇలా..

హెచ్ఎంపీ వైరస్ సోకిన వారు దగ్గు, తుమ్ముల ద్వారా వెదజల్లే తుంపర్ల వలన వ్యాపిస్తుంది. వైరస్ సోకిన వ్యక్తితో సన్నిహితంగా మెలగడం లేదా వైరస్‌తో కలుషితమైన ప్రాంతం నుంచి వచ్చిన వ్యక్తుల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది.

వైరస్ నిర్ధారణ

శ్వాసకోశ సంక్రమణను నిర్ధారించడానికి శారీరక లక్షణాలు రోగ చరిత్రను తెలుసుకుంటారు. అనారోగ్యానికి కారణమయ్యే వైరస్ రకాన్ని నిర్ధారించడానికి ప్రయోగశాల పరీక్షలను నిర్వహిస్తారు. అరుదుగా ఆస్పత్రిలో చేరితే బ్రాంకోస్కోపీ చేయవచ్చు. అక్కడ ద్రవం నమూనా తీసి వైరస్‌లు పరీక్షిస్తారు. ఈ వైరస్ ప్రాబల్యం ఉన్న చోట్ల నాట్ (న్యూక్లియిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ టెస్ట్ (ఎన్ఏఏటీ) ద్వారా వైరస్ జన్యువు ఉనికి కనుగొనడం, ఇమ్యునోఫ్లోరోసెన్ లేదా ఎంజైమ్ ఇమ్యునోఅస్సే ఉపయోగించి శ్వాసకోశ స్రావాలలో వైరస్ యాంటిజెన్‌లను నిర్ధారించడం జరుగుతుంది.

నివారణ, చికిత్స

ప్రస్తుతానికి దీనికి చికిత్స, టీకాలు లేవు. సాధారణంగా చికిత్స ఎక్కువగా లక్షణాలను తగ్గించే విధంగా ఉంటుంది. నొప్పి, జ్వరం, ముక్కు దిబ్బడను నియంత్రించడానికి ఎసిటమైనోఫెన్, ఇబుప్రోఫెన్ వంటి ఔషధాలను ఉపయోగించడం, అలాగే శ్వాసలో తీవ్రమైన గురక, దగ్గు ఉన్న రోగులకు తాత్కాలికంగా ఇన్ హేలర్ ఉపయోగించాల్సిన అవసరం ఉంటుంది. హెచ్ఎంపీవీ సోకిన వ్యక్తులకు దూరంగా ఉండడం, వారు ఉపయోగించిన వస్తువులు వాడకపోవడం, తరచుగా చేతులు శుభ్రం చేసుకోవడం, దగ్గు జలుబు ఉన్నప్పుడు ముక్కు, నోటిని కప్పి ఉంచడం ద్వారా హెచ్ఎంపీవీ వ్యాప్తిని నివారించవచ్చు. ఈ లక్షణాలు ఉన్నప్పుడు బయట ప్రదేశాలలో తిరగరాదు. సీఓపీడీ, ఆస్తమా, పల్మనరీ ఫైబ్రోసిస్ వంటి దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్న వ్యక్తులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.

వైద్యులను అప్రమత్తం చేశాం



హెచ్ఎంపీవీ వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వైరస్ బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులను, వైద్యులను హెచ్ఎంపీవీ వైరస్ పట్ల ముందస్తుగా అప్రమత్తం చేయడం జరిగింది. జిల్లాలోని 54 ప్రాథమిక కేంద్రాల్లో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండేలా, జలుబు, దగ్గు, జ్వరానికి అవసరమైన మందులు సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ఎక్కడైనా వైరస్ అనుమానిత కేసులు గుర్తిస్తే వెంటనే జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాలి.

– డాక్టర్ బి.నాయక్, జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో

లారీ ఢీకొని మహిళ మృతి



గుడాల ఆదిలక్ష్మి (ఫైల్)

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని ఒక మహిళ మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముత్యాలపల్లికి చెందిన గుడాల ఆదిలక్ష్మి (53) గెద్దలవంపు వెళ్లే రోడ్డుకు వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా లారీ ఢీకొంది. తీవ్ర గాయాలైన ఆదిలక్ష్మిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఆదిలక్ష్మి కుమారుడు మహాలక్ష్మీరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బండి సత్యనారాయణ తెలిపారు.

గడ్డి మందు తాగి లేఖరి మృతి

భీమవరం: పట్టణంలోని నర్సయ్య అగ్రహారానికి చెందిన బైలపాటి గొల్ల రామకృష్ణ (33) గడ్డిమందు తాగి మృతి చెందినట్లు వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ జీజీఎస్ఎస్ చక్రవర్తి సోమవారం చెప్పారు. వివరాల ప్రకారం.. రామకృష్ణ వికలాంగుడు కావడంతో పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజుల లేఖరిగా పనిచేస్తున్నాడు. ఇటీవల దస్తావేజులు ఆన్‌లైన్ సిస్టమ్ కావడంతో ఉపాధి కోల్పోయాడు. అంతేగాక వివాహం కూడా కాకపోవడంతో మనస్తాపం చెందిన అతడు ఈనెల 5వ తేదీన లూథరన్ హైస్కూల్ ఆవరణలో గడ్డిమందు తాగి విషయాన్ని తండ్రికి చెప్పాడు. దీంతో రామకృష్ణను హుటాహుటిన భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం విజయవాడ తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తండ్రి పెద్దిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ చక్రవర్తి చెప్పారు.

దారంతా మంచు తెరలు

సోమవారం ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. దీంతో రహదారులపై ప్రయాణించేవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక శోభనాచలుడి కొండ మంచు తెరల్లో చూడముచ్చటగా ఉంది. వరాహ పుష్కరిణిని పొగమంచు కమ్మేసి సరోవరాన్ని తలపించింది. మంచు కురిసిన సమయంలో విజయవాడ, నూజివీడు రహదారుల్లో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దారి కనబడనంతగా మంచు కురవడంతో వాహనదారులు వాహనాల హెడ్‌లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. – ఆగిరిపల్లి



వరాహ పుష్కరిణిని కమ్మేసిన పొగ మంచు



ఆగిరిపల్లి-విజయవాడ రహదారిలో దట్టంగా అలుముకున్న పొగ మంచు

వాహనం అదుపుతప్పి యువకుడి మృతి



హరీష్ (ఫైల్)

ఇరగవరం: ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి ఇరగవరం మండలం కె.ఇల్లింద్రపర్రు గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం కె.ఇల్లిందలపర్రు గ్రామానికి చెందిన మోరం హరీష్ (24) తన స్నేహితుడు ఆది ధర్మారావుతో కలిసి ఆదివారం రాత్రి 7 గంటలకు ద్విచక్రహహనంపై తూర్పు విప్పర్రు బయలు దేరారు. స్థానిక సచివాలయం సమీపంలోకి వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి ఇద్దరూ కిందపడిపోయారు. ఈ ఘటనలో హరీష్ తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన తణుకు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం అర్ధ రాత్రి హరీష్ మృతి చెందాడు. హరీష్ మృతదేహానికి తణుకు ఆసుపత్రిలో సోమవారం పోస్టు మార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. హరీష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జానా సతీష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టి.నరసాపురం: సాయంపాలెంకు చెందిన పులగం పిచ్చియ్య మద్యానికి బానిస. దీంతో అతని భార్య, పిల్లలతో కలిసి రెండేళ్లుగా పుట్టింట్లో ఉంటోంది. ఈ నెల 3న మద్యం తాగి ఇంటికి వచ్చిన పిచ్చియ్యను అతని తల్లి సుబ్బలక్ష్మి మందలించడంతో మనస్థాపానికి గురై పురుగుమందు తాగాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 5న పిచ్చియ్య మృతి చెందాడు. మృతుని తల్లి సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు రీజియన్ నూతన కార్యవర్గం

ఏలూరు (టూటౌన్): స్థానిక గిరిజన భవనంలో నిర్వహించిన ఏపీ యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏలూరు రీజియన్ ద్వైవార్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏలూరు రీజియన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్.లక్ష్మణరావు, డిప్యూటీ రీజినల్ కార్యదర్శిగా బావనరుషి, దివ్య రజిని, కోశాధికారిగా ఎస్‌కే ఉస్మాన్, అసిస్టెంట్ కార్యదర్శిగా ఎస్.చంద్రశేఖర్ మరో 10 మంది కమిటీ సభ్యులను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాలే శ్రీనివాసరావు, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.రాంబాబు, యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఉదయ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్ లక్ష్మణరావు సోమవారం సమావేశం నిర్ణయాలను మీడియాకు వివరించారు.

ఏలూరులో డ్రోన్ సమ్మిట్



ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో డ్రోన్స్ పనితీరును పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

ఏలూరు టౌన్: ప్రజల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిస్తున్న అత్యాధునిక డ్రోన్స్ ఎంతగానో ఉపయోగపడతాయని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఐడియా ఫోర్జ్ డ్రోన్ ఫ్రాంచైజ్ మోడల్ ఫ్లెట్‌ను ఎస్పీ శివకిషోర్, జేసీ ధాత్రి రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయ సమావేశ మందిరంలో మినీ డ్రోన్ సమ్మిట్‌ను ఏర్పాటు చేశారు. అత్యాధునిక డ్రోన్స్ వినియోగం, సాంకేతికత, భద్రతా పరమైన అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలీస్ అధికారులకు ఫ్రాంచైజ్ నిపుణులు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ శివకిషోర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రీతిలో భద్రత కల్పించడం, ఆటోమేటెడ్ చలాన్ విధానానికి డ్రోన్స్‌ను వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ రద్దీ పర్యవేక్షణ, వీఐపీ భద్రతకు సంబంధించి ప్రతి అంశాన్నీ పరిశీలించడం, క్రౌడ్ మేనేజ్‌మెంట్, నేర నివారణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, రాష్ట్ర సరిహద్దుల్లో పెట్రోలింగ్, అక్రమ రవాణాపై నిత్యం నిఘా ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని ఎస్పీ చెప్పారు. జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే డ్రోన్ సమ్మిట్‌ను నిర్వహించారనీ, దానిలో భాగంగా ఏలూరులో మినీ డ్రోన్ సమ్మిట్ ఏర్పాటు చేయటం శుభపరిణామం అన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ భూ సర్వేలలో డ్రోన్స్‌ను వినియోగిస్తున్నారని చెప్పారు. భవన నిర్మాణ అనుమతుల నుంచి ప్రతి అంశంలోనూ డ్రోన్స్‌ను ఉపయోగించుకుంటే సులభతరం అవుతుందన్నారు. ఈ సమ్మిట్‌కు ఏలూరు నగరపాలక సంస్థ అధికారులు, అటవీశాఖ, రవాణాశాఖ అధికారులు, ఎస్‌బీ సీఐలు మల్లేశ్వరరావు, బీ.ఆదిప్రసాద్, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, జంగారెడ్డిగూడెం డీఎస్పీ యూ.రవిచంద్ర, పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐలు, ఎస్సైలు హాజరయ్యారు.

శ్రీవారి గోసంరక్షణ పథకానికి రూ.లక్ష విరాళం



దాతలకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణ పథకానికి ఒక భక్తుడు సోమవారం రాత్రి రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన రేపక రవీంద్రకుమార్, చంద్రశేఖర్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

హామీలను విస్మరిస్తే ఉద్యమిస్తాం

మంత్రి లోకేష్‌కు ఏబీవీపీ హెచ్చరిక

భీమవరం: కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడం దారుణమని ఏబీవీపీ నాయకులు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం భీమవరం పర్యటనకు వచ్చిన లోకేష్‌కు ఏబీవీపీ నాయకుడు కాయిత డిన్నుచందు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. తల్లికి వందనం, జీవో నంబర్ 77 రద్దు చేయడం వంటి అంశాలు వాయిదా వేస్తూ కాలం వెళ్లదీయడం వల్ల విద్యార్థులు ఉద్యమించే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రస్తుత ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రతన్ టాటా ఆదర్శనీయుడు

పారిశ్రామిక రంగానికి రతన్ టాటా ఆదర్శనీయుడని మంత్రి నారా లోకేష్ అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలో ఏర్పాటుచేసిన రతన్ టాటా విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం భీమవరం పట్టణం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పాల్గొన్నారు.

మాంసప్రియులూ.. తస్మాత్ జాగ్రత్త

- శీతలీకరణ కేంద్రాల్లో భారీగా నిల్వలు
- పండుగల సీజన్ కావడంతో జోరుగా మాంసం విక్రయాలు
- వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందంటున్న అధికారులు



మేక మాంసం విక్రయిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: పండుగలు, జాతరల సీజన్ కావడంతో మాంసం ప్రియులు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని పశు, వైద్యశాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. వ్యాపారులు తమ స్వలాభం కోసం శీతలీకరణ కేంద్రాల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన మాంసాన్ని విక్రయించి జేబులు నింపుకోవడంతో మాంసాహార ప్రియుల ఆరోగ్యంపై తీవ్ర చూపుతుందని పేర్కొంటున్నారు. భీమవరం మండలంతో పాటు పట్టణంలో సుమారు 400కు పైగా మాంసం దుకాణాల ద్వారా రోజువారీ విక్రయాలతో పాటు, శుభకార్యాలతో ఒక్కరోజులో సుమారు 20 టన్నులు పైగా కోడి, మేక, పశువుల మాంసం విక్రయిస్తున్నట్లు ప్రాథమిక అంచనా. పండుగలు, జాతరల సీజన్ రావడంతో కోళ్లు, మేకలు, గొర్రెలు పెంపకాలపై వ్యాపారులు దృష్టి సారించారు. గత డిసెంబర్ 31 అర్ధరాత్రి వరకు భారీ ఎత్తున వ్యాపారం జోరుగా సాగింది. రాత్రి వరకూ బిర్యానీ, ఫ్రైడ్ రైస్, చికెన్ పకోడి వివిధ రకాల మాంస విక్రయాలు చేశారు.

శీతలీకరణలో ఎక్కువ రోజులు నిల్వలు

మాంసం దుకాణాల్లో చాలా వరకు వినియోగదారులకు అమ్మగా మిగిలిన మాంసాన్ని శీతలీకరణ కేంద్రాల్లో నిల్వ చేయడం పరిపాటిగా మారింది. అంతేకాకుండా నిల్వ ఉంచిన మాంసాన్ని వంటకాలలో వివిధ రకాల ఫ్లేవర్ మసాలాలతో హోటల్స్, రెస్టారెంట్లకు విక్రయిస్తుండగా ఫుడ్ సేఫ్టీ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ వ్యాపారస్తులు ఇచ్చే మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు పలువురు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే నిల్వ ఉన్న మాంసంపై బ్యాక్టీరియా, వైరస్‌లు వాప్తి చెందుతాయని వీటి కారణంగా మాంసంలో విష పదార్థాలు చేరి ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందని పశు సంవర్ధక శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. మాంసాహార ప్రియులు మాంసం వినియోగం, కొనుగోళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పరిశీలించి తీసుకోవాలి



కొనుగోలు సమయంలో మాంసాన్ని పరిశీలించి తీసుకోవడం ఉత్తమం. కొందరు వ్యాపారులు స్వలాభం కోసం నిల్వ మాంసం విక్రయాలు చేస్తున్నారు. మేము మాంసం దుకాణాలపై విధిగా తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– పి.పుండరీబాబు, మండల పశువైద్యాధికారి

శాఖాహారం ఆరోగ్యానికి మేలు



శాఖాహారం ఆరోగ్యానికి ఎంతో మంచిది. తాజా ఆకుకూరలు, కాయగూరలతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మాంసాహారం ఎంత తక్కువ తీసుకుంటే అంత మంచిది.

– ఎ.అరుణకుమారి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి, గొల్లవానితిప్ప

క్లుప్తంగా

వాసవిలో సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో సూర్యనారాయణ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏలూరు రోడ్డులో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో పుష్యమాసం సప్తమి సందర్భంగా సోమవారం సూర్యనారాయణ స్వామికి విఘ్నేశ్వర పూజ, మూల విరాట్‌కు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, ఫల రసాలతో ఆలయ పురోహితులు సత్యనారాయణ శర్మ, తరుణ్ వర్మలు అర్చకత్వంలో విశేష పూజలు జరిగాయి. విశేషఅలంకరణ గావించారు. ఆర్యవైశ్యసంఘం సెక్రటరీ నున్న బాల త్రిపుర సుందరరావు, పేరూరి కాశయ్యలు పర్యవేక్షించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ-పంటలో పేర్లు నమోదు చేసుకోవాలి



ఆర్‌ఎస్.ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: దాళ్వా వరి సాగు చేపట్టిన రైతులు ఈ-పంటలో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడా రు. ఇప్పటి వరకు 2512 ఎకరాల్లో ఈ-పంట నమోదైందన్నారు. ఈ-పంట నమోదు ద్వారా బీమా,పంట కొనుగోలు, ఎరువులు, పురుగు మందులపై సబ్సిడీ వంటి సౌకర్యాలు వర్తిస్తాయన్నారు. దాళ్వా సీజన్‌లో 25,400 ఎకరాల్లో వరి సాగవుతుందన్నారు. ఇప్పటి వరకు 512 హెక్టార్లలో వరి నారుమడి వేసినట్లు తెలిపారు. 15,792 ఎకరాల్లో నాట్లు పడ్డాయని, మరో 8వేల ఎకరాల్లో నాట్లు వేయవలసి ఉందన్నారు. త్వరితగతిన నాట్లు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గత నెల 31వ తేదీతో ముగిసిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం గడువును ఈ నెల 15వ తేది వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గూడెంలో విజిలెన్సు దాడులు



గూడెంలో విజిలెన్సు దాడుల దృశ్యం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని అపరాల దుకాణాలలో విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు దాడులు చేశారు. రీజినల్ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు అధికారి వి.శ్రీరాం బాబు ఆదేశాల మేరకు సోమవారం హోల్ సేల్ దుకాణాలు, పప్పుల దుకాణాలలో లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వీరవెంకట సత్యనారాయణ జనరల్ స్టోర్సు, గ్రంధి మాణిక్యాలరావు ఎంటర్‌ప్రైజస్, లలిత ఎంటర్ ప్రైజస్, సూర్య ఎంటర్ ప్రైజస్, న్యూ విజయలక్ష్మి ట్రేడర్స్‌లలో సోదాలు చేశారు. ఈ మేరకు లీగల్ మెట్రాలజీ అధికారులు పలు షాపులపై కేసు నమోదు చేశారు.ఈ తనిఖీల్లో విజిలెన్సు ఎస్‌ఐలు పి.శివరామకృష్ణ, పాల్గొన్నారు.

జగ్గయ్యశాస్త్రిని ఆదర్శంగా తీసుకోవాలి



స్వాతంత్ర్య సమరయోధుడు జగ్గయ్య శాస్త్రి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కామేష్ తదితరులు

తణుకు అర్బన్: స్వాతంత్ర్య సమరయోధులు ముదిగంటి జగ్గయ్య శాస్త్రి జయంతి వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. తణుకు బ్యాంక్ కాలనీలోని స్వాతంత్ర్య సమరయోధుల పార్కు ప్రాంతంలో ఉన్న జగ్గయ్య శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో తణుకు ప్రాంతం నుంచి పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపిన పోరాటయోధుడు జగ్గయ్య శాస్త్రి అన్నారు. అటువంటి మహనీయుడి ఆశయాలు, ఆలోచనలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. న్యాయవాదులు ఆంజనేయులు, పొట్ల సురేష్, కౌరు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

9 నుంచి ముక్కోటి పూజలు

పెనుగొండ: ఆచంట కాపుల వీధిలోని సీతారాముల ఆలయం వద్ద ఈ నెల 9 నుంచి 13 వరకు పుణ్య వైకుంఠ ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 9న కుంకుమార్చనలు, లక్ష తులసీ పూజ, అభిషేకాలు నిర్వహిస్తామని వివరించారు.

తణుకు ఆర్టీసీ బస్సుల్లో సమస్యల హారన్

- మరమ్మతులకు నోచుకోని వైనం
- కాలం చెల్లిన బస్సులతో గందరగోళం
- మసకబారిన అద్దాలతో నడుస్తున్న దుస్థితి
- భయపడుతున్న ప్రయాణికులు

తణుకు అర్బన్: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం. సురక్షితంగా గమ్యం చేరాలంటే ఆర్టీసీనే ఎన్నుకోండి అంటూ ఆర్టీసీ సమావేశాల్లో అధికారులు ఊదరగొడుతుండడం పరిపాటి. అయితే ప్రయాణం సురక్షితమే అయినప్పటికీ బస్సులు మాత్రం సురక్షితంగా లేవనేది ప్రయాణికుల వాదన. ఆర్టీసీ బస్సు డిపోల్లోని గ్యారేజీల్లో ప్రతి బస్సును అన్ని విభాగాల మెకానిక్‌లు మరమ్మతులు చేస్తుంటారు. డిపో పరిధిలో ఉన్న ఫిర్యాదుల బుక్‌లో సైతం బస్సులో ఉన్న సమస్యలను డ్రైవర్లు రాస్తుంటారు. దీంతో సంబంధిత మెకానిక్ విభాగం తక్షణమే మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. కానీ గత కొంతకాలంగా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకపోవడంతో తణుకు డిపోలో కొన్ని బస్సులు అధికశాతం మరమ్మతులకు గురై ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణాలు చేస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా కొన్ని బస్సులు ఒక పక్కకు ఒరిగిపోయి శిథిలావస్థకు చేరి ప్రయాణాలు చేస్తుండడం చూస్తూ ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు.

తణుకు డిపోలో 81 బస్సులు..

తణుకు ఆర్టీసీ డిపోకి సంబంధించి పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు, డీలక్స్, అల్ట్రా డీలక్స్, ఇంద్ర బస్సులు 60 సొంత బస్సులతో పాటు 21 అద్దె బస్సులు కలిపి మొత్తం 81 బస్సులు నిత్యం ప్రయాణాలు చేస్తున్నాయి. అయితే కొన్ని బస్సులు పూర్తి సురక్షితంగా ఉన్నా కొన్ని మాత్రం ప్రయాణాలకు అనువుగాలేవని ప్రయాణికులు చెబుతున్నారు.



తణుకు రాష్ట్రపతి రోడ్డులో ఒరిగిపోయి ప్రమాదకరంగా మారిన తణుకు డిపో బస్సు



తణుకులో ప్రమాదకరంగా నడుస్తున్న ఆర్టీసీ తణుకు డిపో బస్సు



తణుకు డిపో బస్సులో విజన్ సరిగాలేని అద్దాలతో ప్రమాదకరంగా మారిన బస్సు



తణుకులో అద్దాలు ఊడిపోయి, వెల్డింగ్‌లు కూడా చేయకుండా ప్రమాదకరంగా ఉన్న తణుకు డిపో బస్సు

ముఖ్యంగా బస్సు డ్రైవర్‌కు రహదారి పూర్తి స్థాయిలో పూర్తి విజన్ కనిపించాల్సి ఉన్నప్పటికీ అద్దాలు మసకబారిపోయి రహదారిని గుచ్చిగుచ్చి చూసే పరి స్థితి డ్రైవర్లకు దాపురించిందని తెలుస్తోంది. అంతేకాకుండా కిటికీలకు ఉండాల్సిన అద్దాలు లేకపోగా కొన్ని వైర్లతో కట్టి ఉండడంతో ప్రయాణికులు, విద్యార్థులు భయపడుతున్నారు. కొన్ని బస్సుల్లో జాయింట్‌లు ఊడిపోయి వెల్డింగ్ పనులు కూడా చేయకపోవడంతో తమ దుస్తులు, వస్త్రాలు చిరిగిపోతున్నాయని మహిళలు వాపోతున్నారు. ఎప్పటికప్పుడు పూర్తి స్థాయి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితులు డిపోలో ఉండాల్సి ఉండగా గత కొన్ని నెలలుగా ఆ తరహా మరమ్మతులు చేయించడంలో జాప్యానికి కారణాలు నిధుల కొరతో మరే ఇతర కారణాల్లో కానీగతంలో మాదిరిగా పనులు జరగడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కాలం చెల్లిన బస్సులతో పాటు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న బస్సులను పక్కనపెట్టి వాటి స్థానాల్లో మంచి బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనిపై తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్‌ను సాక్షి వివరణ కోరగా కొన్ని బస్సుల్లో ఇబ్బందులు ఉన్నాయని వాటి స్థానంలో రాబోయే రోజుల్లో తణుకు డిపోకి 6 కొత్త బస్సులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. బస్సుల్లో ఉన్న సమస్యలను పర్యవేక్షించి పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు.

కొన్ని బస్సులు ప్రమాదకరం



తణుకు ఆర్టీసీ డిపోలోని కొన్ని బస్సులు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పటికీ నడుపుతున్నారు. ముఖ్యంగా బస్సు ముందు అద్దాలు మసకబారి ఉండడం, కిటికీలకు అద్దాలు సక్రమంగా లేకపోవడం దారుణం. పిల్లలతో బస్సులు ఎక్కాలంటే భయపడాల్సి వస్తోంది. అంతేకాకుండా కిటికీలు లేని బస్సుల్లో రోడ్డు మీద ఉన్న దుమ్ము ధూళి బస్సులో ప్రయాణికులకు పట్టేస్తుంది. అధికారులు స్పందించి బస్సులను అన్ని విధాలుగా కండిషన్‌లో ఉంచాలి.

– ఝాన్సీ లారెన్స్, తణుకు

కార్గో సేవల్లో తణుకు డిపో ప్రథమ స్థానం అభినందనీయం



తణుకు ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవల్లో డ్రా కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ రామ్‌కుమార్

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలు జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అన్నారు. కార్గో కొరియర్, పార్సిల్ డోర్ డెలివరీ మాసోత్సవాలలో భాగంగా తణుకు డిపోలో డోర్ డెలివరీ బుకింగ్‌లపై నిర్వహించిన డ్రా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ ప్రయాణం ఎంత సురక్షితమో అంతే సురక్షితంగా పార్శిల్స్‌ను ఇంటి గుమ్మంలోకే అందజేయడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా బస్సు స్టేషన్ ఆవరణలో డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ ఆధ్వర్యంలో కమిషనర్ రామ్‌కుమార్ డ్రా తీసి రెండవ వారం డోర్ డెలివరీ విజేతలను ప్రకటించడంతోపాటు మొదటి వారం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, ట్రాఫిక్ ఇనస్పెక్టర్ వేమూరి దయాకర్, సూపరింటెండెంట్ వెన్నా రమణమూర్తి, గ్యారేజ్ ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాస్, ఆయిల్ డిపో క్లర్క్ మహ్మద్ అంజాద్ అలీ, జనరల్ అసిస్టెంట్ డిపో క్లర్క్ చింతల రామకృష్ణ, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఉనికిలి నిత్య కల్యాణరాజు, షాలేం పెన్ కార్నర్ యజమాని మిరియాల అమరనాథ్, మొదటి వారం బహుమతి విజేతలు, డిపో సిబ్బంది, కార్గో కొరియర్ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

యానాదుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు అర్బన్: డంపింగ్ యార్డు ప్రాంతంలో నివసిస్తున్న యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని ఉందుర్తి పాల్ ఫౌండేషన్ సభ్యురాలు అడ్డగర్ల అజయ కుమారి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉందుర్తి పాల్ ఫౌండేషన్, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ యానాదులకు ఆధార్, రేషన్ కార్డులు ఇప్పించి పింఛన్లు మంజూరు చేయాలని, ఇళ్ల స్థలాలు మంజూరుతోపాటు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని, యానాదుల పిల్లలతో వెట్టి చాకిరీ చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యానాదులు పట్టణ పరిధిలోనే ఉన్నప్పటికీ సమాజానికి చాలా దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యానాదుల అమాయకత్వాన్ని అడ్డు పెట్టుకొని కొంతమంది క్యాష్ చేసుకొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా 70 కుటుంబాలు ఉంటే



తణుకులో తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

కేవలం 20 కుటుంబాలకు మాత్రమే గతంలో ఆధార్ కార్డులు మంజూరయ్యాయని, ఆధార్ కార్డులు లేకపోవడం వలన ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. అనంతరం తహసీల్దార్ డి.అశోక్ వర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉందుర్తి పాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉందుర్తి ప్రసన్న కుమార్, జోహాన్ పాల్, అభిషేక్ బోస్, బన్నీ, పండు, నాగరాజు, సత్తి, ఆనంద్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సొంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం స్థానిక 24, 25 వార్డులల్లో పేదలకు ఇళ్ల స్థలాల దరఖాస్తులు పంపిణీ చేశారు. వారిచేత దరఖాస్తులు పూర్తి చేయించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇళ్లు లేని పేదలకు పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు ఇంటి స్థలాలు కేటాయిస్తామని వాగ్దానం చేశారని, ఆ వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, వద్దాది మేరి, నిమ్మకాయల విజయకుమార్ తదితరులు మాట్లాడారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాల కోసం ప్రజలు చేత దరఖాస్తులు చేయిస్తున్న సీపీఐ నాయకులు

వేతన బకాయిలు చెల్లించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ విభాగాల కాంట్రాక్ట్ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతన బకాయిలు చెల్లించలేదని, తక్షణమే చెల్లించాలని కోరుతూ ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిబ్బందిచే సోమవారం ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. పీఎఫ్ బకాయిలు జమ చేయాలని, సిబ్బందికి యూనిఫారంలు, పరికరాలు అందజేయాలని కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఏఐటీయూసీ నాయకులు ఓసూరి వీర్రాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన కార్మికులే ఏరియా ఆసుపత్రిలో పారిశుద్ధ్య, సెక్యూరిటీ పనులకు వస్తున్నారని, వారికి నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే వారెలా బతుకుతారని ప్రశ్నించారు. వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రి ఏరియా సూపరింటెండెంట్ డాక్టర్ తాతారావుకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.లక్ష్మీనారాయణ, కార్యదర్శి మండలపర్తి హరీష్, మునిసిపల్ వర్కర్స్‌యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, కుమారి, జి.సురేష్, వెంకటలక్ష్మి, నాగేంద్ర తదితరులు నాయకత్వం వహించారు.



ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా దృశ్యం

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు తెలిపారు. స్థానిక వీకర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 3, 4వ వార్డులలో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్‌పై సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డులలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయడం ద్వారా దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వ్యాపు, వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చునని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికడదామన్నారు. నిల్వ ఉంచిన నీటి తొట్లు, బానలు, డ్రమ్ములో నీటిని తొలగించి వాటిని టెంకాయి పీచుతో బాగా శుభ్రపరచి కడిగి ఆరబెట్టాలని, తరువాత నీటిని నింపాలని పలు సూచనలు చేశారు. లార్వా దశలోనే దోమల్ని నాశనం చేయవచ్చునన్నారు. ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు సరళ, కెంపురత్నం, సౌజన్య, ఆశా వర్కర్ శ్రీదేవి, రమణ కోమలి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(టీఓసీ): అవగాహన ర్యాలీ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పాటు దోమ కాటు, అపరిశుభ్ర వాతావరణం వంటి పరిస్థితుల్లో వచ్చే రోగాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని వెంకట్రాయపురం అరుంధతిపేట ఏరియాలో సోమవారం క్షేత్ర స్థాయిలో గ్రౌండ్ లెవెల్ మస్కిటో బ్రీడింగ్ సోర్సెస్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. ముఖ్యంగా ఇంటి ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను నిరోధించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా స్థానికంగా గుర్తించబడిన పారిశుద్ధ్య సమస్యలను వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్ నందు సదరు వార్డు హెల్త్ సెక్రటరీలచే అప్లోడ్ చేయించారు. అనంతరం స్థానిక ఎంపీపీ స్కూలును సందర్శించారు. ఆవరణలో పరిసరాల పరిశుభ్రతను, మధ్యాహ్నం భోజన పథక వంటగదిని హైజీన్ పరంగా పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగు మార్గదర్శక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.గోపాలకృష్ణ, కమిటీ చైర్మన్ పి.లావణ్య, వార్డు హెల్త్ సెక్రెటరీ వి.పద్మజ, ఆశా కార్యకర్త కెవిఆర్‌కె వేణి పాల్గొన్నారు.



తణుకు అర్బన్: వెంకటరాయపురం పాఠశాలలో పరిసరాలను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

సామాజిక పింఛన్ల తనిఖీ



పింఛన్లను తనిఖీ చేస్తున్న జిల్లా టీం సభ్యులు

అత్తిలి: సామాజిక పింఛన్ల తనిఖీలో భాగంగా సోమవారం అత్తిలి మండలం కె సముద్రపుగట్టు, పాలి గ్రామాలలో మంచానికే పరిమితమైన పెన్షనర్లను అధికార బృందం తనిఖీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక పింఛన్లను తనిఖీ చేస్తున్నట్లు ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. జిల్లా టీం తరపున అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ షాదీద్‌జామిల్, డాక్టర్ జాన్‌హరేషన్, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఏపీఓ టి మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రావిపాడులో రెవెన్యూ సదస్సు

పెంటపాడు: మండలంలోని ఈనెల 7న రావిపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ స్కూలు వద్ద ఉన్న సొసైటీ గ్రౌండ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో కొత్త రేషన్ కార్డులు, పట్టాదారు పాస్‌బుక్‌ల కోసం ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్‌కేఎస్‌డీలో అలరించిన శారీ ఎగ్జిబిషన్

తణుకు అర్బన్: ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో సోమవారం శారీ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆర్టిస్ట్, విశిష్ట మహిళా అవార్డు గ్రహీత ఎ.శ్రీలత రూపొందించిన ఫ్రీహ్యాండ్ పెయింటింగ్ శారీలతోపాటు పేపర్ క్విల్లింగ్ ఆల్ క్లాక్‌లు, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి మాట్లాడుతూ వస్త్రరంగంలో కుట్టు పరిశ్రమల ద్వారా ఎంతోమంది మహిళలు ఉపాధి పొందుతున్నారని స్పష్టం చేశారు. శ్రీలత ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లోని కలెక్షన్స్ ఆకర్షణీయంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయి, కె.పద్మజారాణి, వి.తులసీరత్నం, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



శారీ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఉషారాణి తదితరులు

అధ్వానంగా పారిశుద్ధ్యం

పెంటపాడు: గ్రామాల్లో ఎక్కడ చూసినా వీధులు చెత్తాచెదారంతో, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. ముఖ్యంగా పెంటపాడు మండలంలోని ప్రధానంగా అలంపురం, ప్రత్తిపాడు, రాచర్ల, వల్లూరుపల్లి, దర్శిపర్రు గ్రామాలతో పాటు, జట్లపాలెం మిడ్ లెవిల్ కాలువ ప్రాంతాలలో కె. పెంటపాడు, బిళ్లగుంట, ప్రాంతాలలోని పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. గ్రామంలో చాలా చోట్ల డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక అవి పూడిపోయి మురుగునీరు నిల్వ ఉండి, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లు వెంబడి వెళ్లాలంటే గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమల వ్యాప్తి చెందడంతో చుట్టుపక్కల నివాసాల వారు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిస్తే చెత్తా, చెదారం కుళ్లి దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు భయపడుతున్నారు.



రాచర్ల నుంచి దర్శిపర్రు వరకు మిడ్‌లెవిల్ కాలువలో అధ్వానంగా ఉన్న చెత్త దృశ్యం

ప్రతిభను వెలికితీసే విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు



తణుకు ఎస్‌కేఎస్‌డీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



తణుకు ఎస్‌కేఎస్‌డీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోగిమంట సందడిలో విద్యార్థులు

అలరించిన సంక్రాంతి సంబరాలు

తణుకు అర్బన్: విద్యార్థిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని హైదరాబాద్‌కు చెందిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్ఐఎంఎస్ఎంతు శరత్ ముత్యాల అన్నారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్మార్ట్ ఆంధ్ర హ్యాక్‌థాన్, సంక్రాంతి సంబరాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి రోజుల్లో సైన్స్‌రంగం ఎంతో విస్తరించిందని విద్యార్థుల ఆలోచనలకు అధ్యాపకుల సహకారం జోడైతే మంచి ప్రదర్శనలు రూపొందించబడతాయని స్పష్టం చేశారు. విశాఖపట్నం, అనంతపురం, కడప తదితర జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ ప్రాజెక్ట్ నమూనాలతో ప్రదర్శనకు ఉంచారు. జూనియర్ విభాగంలో 22, సీనియర్ విభాగాల్లో 27 టీంలు పాల్గొనగా గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ముందుగా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అలరించాయి. భోగిమంటతో పాటు విద్యార్థినులు పెట్టిన రంగవల్లులు, హరిదాసు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అనీల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బసవ రామకృష్ణ, కొమ్మిరెడ్డి శ్రీను, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.